28-5-86

## మినీ కథ

# తూర్పు-పడమర

లీలాప్రసాద్ వస్తున్నాడని తెలిసి నాకు భలే ఆనందం కలిగింది. వాడిక్కడున్న వారం రోజులు సెలవు పెట్టాలని ముందే అనుకున్నాను. వాడికి కంపెనీ ఇచ్చి వాడితో తిరగాలి. వాడితో గడపాలి. వాడికి కావలసిన సహాయ సహకారాలన్నీ అందించాలి. ఇవన్నీ అనుకున్నాను.

లీలాప్రసాద్ రెండే రెండు పనులమీద హైద్రాబాద్ వస్తున్నాడు. అందులో మొదటిది- నన్ను చూడడం.

వాడికి పిల్ల నిస్తామని ఇద్దరు పెద్ద మనుషులు హైద్రాబాద్ నుంచి వెళ్ళి వాడి తండ్రికి చెప్పారట. ఆ సంబంధాలు చూడటం వాడి రెండో పని.

"నే నక్కడ ఉన్నన్నాళ్ళూ నువ్వు నాతో ఉండాలి. సెలవు పెట్టు"అని ఉత్తరంలో రాశాడు. వాడి మాట నే నెప్పుడు కాదన్నాను కనుక!

×× ×× ××

ఒకటో తరగతి నుంచి స్కూలు ఫైనల్ వరకు నేను, లీలాప్రసాద్ కలిసే చదువుకున్నాం. ఎప్పుడూ కలిసే తిరిగేవాళ్ళం. స్కూల్లో చదువుకున్నన్నాళ్ళూ నేను అర్భకంగా ఉండేవాణ్ణి. ఆటల్లోనూ, పోటీల్లోనూ అసలు పాల్గొనేవాణ్ణి కాదు. చదువులో మాత్రం ఎప్పుడూ ముందే ఉండేవాణ్ణి.

లీలాప్రసాద్ ఎప్పుడూ అత్తెసరు మార్కుల్తో పాసయేవాడు. మనిషి బలిష్ఠంగా ఉండేవాడు. ఆటల్లో ముందుండే వాడు. శారీరకంగా బలిష్ఠంగా ఉన్నందువల్ల పోట్లాటలు, కొట్లాటల్లో ముందుండేవాడు. వాటి జోలికి పోకుండా వాణ్ణి వారించడం నా వంతైతే. నా మీద ఈగ వాలకుండా చూసుకోడం వాడి వంతు. బరువులు, బాధ్యతలు లేకుండా, దుష్టలోకం గురించి ఆలోచించకుండా హాయిగా, ఆనందంగా గడిపిన రోజులవి!

తరువాత తరువాత అనేకానేక కారణాల వల్ల నేను బి.ఎస్సి. చదివి బాంక్‌లో గుమాస్తాగా చేరాను. లీలాప్రసాద్ మాత్రం తారాజువ్వలా వెలుగులు కురిపిస్తూ దూసుకుపోయాడు. ఎమ్.ఎస్సి. చేసి, పిహెచ్.డి. చేసి స్కాలర్‌షిప్ సంపాదించి అమెరికా వెళ్ళాడు. అక్కడ రిసెర్చి పూర్తయ్యాక ఉద్యోగంకూడా సంపాదించాడు.

ఇన్నేళ్ళుగా మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతూనే ఉన్నాయి. మా స్నేహం నిలబడే ఉంది.

×× ×× ××

రైల్వే స్టేషన్‌కి వెళ్ళి. లీలాప్రసాద్‌ని రిసీవ్ చేసుకున్నాను. నన్ను చూడగానే గట్టిగా కౌగిలించుకున్నాడు. వాడు మా ఊరు వెళ్ళి తలిదండ్రుల్ని చూసి హైద్రాబాద్ వచ్చాడు. కుశల ప్రశ్నలన్నీ అడిగాను.

స్టేషన్ బయటికొచ్చి నా రూమ్‌కి వెళ్ళడానికి ఆటో అడిగాను. లగేజి ఉంది కదా రెండు రూపాయలు ఎక్కువ ఇమ్మన్నాడు. వెంటనే ఆటో ఎక్కాం. "అసలు మీటర్ మీద ఎక్కువ అడిగినందుకు వాడి మీద మనం కేసు పెట్టొచ్చు" అన్నాడు లీలా ప్రసాద్.

నేను నవ్వి ఊరుకున్నాను.

కొంత దూరం వెళ్ళాక "ఇండియా చాలా మారిందనుకున్నాను. ఏమీ మారలేదు" అన్నాడు.

"ఆ రోడ్లు చూడు- గతుకులు. ఇదే అమెరికాలో అయితే మున్సిపాలిటీ మీద కేసు పెడతారు."

ఇలా బస్సుల దగ్గర్నుంచి, శుభ్రత దగ్గర్నుంచి - జీవితంలో ప్రతి దాన్నీ విమర్శిస్తూనే ఉన్నాడు.

ప్రతిదానికీ "ఇదే అమెరికాలో అయితే" అంటూ సణుగుతూనే ఉన్నాడు. ఒకోసారి నవ్వి ఊరుకునేవాణ్ణి. మరోసారి కారణాలు వివరించి చెప్పేవాణ్ణి. ఒకసారి మాత్రం "అవున్రా! చదువుకున్నవాళ్ళూ, మేధావులూ, దేశానికి ఉపయోగపడేవాళ్ళూ సొంత బాగు కోసం పరాయి దేశాలకి వెళ్ళిపోతున్నారు. ఈ దేశం ఎలా బాగుపడుతుంది?" అన్నాను.

"సరేలే-ఇక్కడికొస్తే మేం బ్రతికినట్టే"అన్నాడు. బరోడాలో ఏదో కంపెనీ ఇంటర్వ్యూ వచ్చిందట.

"పోనీ వెళ్ళరాదూ? జీతం బాగుంటే జాయిన వ్వొచ్చు కదా- వృద్ధాప్యంలో తలిదండ్రులు సంతోషిస్తారు"అన్నాను.

"అబ్బే- ఇండియాలో ఉద్యోగం చెయ్యడమంత ఫూలిష్‌నెస్ మరోటి లేదురా. ఇక్కడ ఉద్యోగాలు రావటం, ప్రమోషన్లు- అన్నీ రికమండేషన్ల మీద ఆధారపడతాయి. అందులో మళ్ళీ కులం,మతం, ప్రాంతం- వీటి ప్రభావం ఎక్కువ. మనిషికున్న విలువలను గుర్తించరు."

లీలాప్రసాద్‌కి ఈ దేశం మీద, ఇక్కడి పరిస్థితులమీద ఓ రకమైన అభిప్రాయం ఏర్పడిపోయింది. అది మార్చడం ఎవరి తరమూ కాదు అనిపించింది నాకు. ఇక్కడ పరిస్థితులు బాగా లేని మాట వాస్తవం. కాని వాడు ఊహిస్తున్నంత భయంకరంగా లేవు.

ఎన్నో విషయాల్లో మా ఇద్దరికీ అభిప్రాయ భేదాలున్నా వాడిక్కడున్న వారం రోజులూ ఎంతో హాయిగా గడిచాయి. వాడు ఇక్కణ్ణుంచి బొంబాయి వెళ్ళాలి. వాడు హైదరాబాద్ వచ్చిన రోజునే బొంబాయికి టికెట్ రిజర్వు చేశాం. వేసవి రద్దీమూలంగా బాగా రష్ ఉంది. వాడి టికెట్ వెయిటింగ్ లిస్టులో ఉంది.

తెల్లారితే వాడి ప్రయాణమనగా స్టేషన్‌కి వెళ్ళి కనుక్కొన్నాం. వాడి టికెట్ వెయిటింగ్ లిస్టులో అరవై మూడునుంచి ఇరవై ఆరుకి వచ్చింది. రిజర్వేషన్ దొరకటం కష్టమని తేలిపోయింది.

"ఒరేయ్ సోమూ ! రేపు బొంబాయి వెళ్ళకపోతే నా ప్రోగ్రాం అంతా పాడైపోతుంది. నీకు రైల్వేలో ఫ్రెండున్నాడని చెప్పావుగా! పోనీ అతని ద్వారా ప్రయత్నించకూడదూ- రైల్వే కోటా సంపాదించమను."

వాడి మాటలు మళ్ళీ చెవుల్లో గింగురుమంటున్నాయి. "అన్నీ రికమండేషన్లమీద ఆధారపడతాయి."

'ఈ దేశం మీవల్లే తగులడిపోతోంది' అందామనుకున్నాను కాని, అనలేక పోయాను.

-వీరభద్రరావ్ పమ్మి

## ఆశాలత

అభాగ్యుల ఆర్తరావాలు
శ్రవోయుగళిని తొలుస్తుంటే
మందిరంలో జపిస్తూ కూర్చున్నాను
ముక్తి కోసం. మందమతిని!

విశాల విశ్వం ఎంతగా పిలిచినా
నన్ను కాదన్నట్టుగా చరించి
పుస్తకాల పురుగు నయ్యాను
విజ్ఞానం కోసం. మందమతిని!

ఇంట్లో జరుగుతున్న భారతంలో
ఇంపుసొంపులు లేవనుకొని
ఇరుగు పొరుగులు పరికించాను
కథావస్తువు కోసం. మందమతిని!

నేను నేనంటూ గుర్తు చేసే
అంతరంగం విడిచి పెట్టి
అవని అంతా గాలించాను
శాంతి కోసం. మందమతిని!



-చల్లా రాధాకృష్ణశర్మ